# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలి

- కలెక్టర్ సత్య శారద
- అధికారుల పనితీరుపై ఆగ్రహం

మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, అక్టోబర్ 30: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. జిల్లాలో 31,800 దరఖాసులు రాగా, ఇప్పటి వరకు 1957 దరఖాస్తులు మాత్రమే పరిశీలించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలసత్వాన్ని వీడి అంకితభావంతో దరఖాస్తులను పరిశీలించి గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ పరిశీలన బృందం నిత్యం కచ్చితంగా 20 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలని, రెవెన్యూ, మున్సిపల్, సాగునీటి పారుదల శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో టీపీ రత్నకుమారి, డిప్యూటీ సీటీ ప్లానర్ రవీంద్ర పాల్గొన్నారు.

**203 ధాన్యం కొనుగోలు కేంద్రాలు**

జిల్లాలో 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో ఆమె సివిల్ సప్లయ్, రైస్ మిల్లర్లతో సమీక్షించారు. ప్రస్తుతం 14 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభమైందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమాలను వాయిస్ రికార్డర్ ద్వారా గ్రామాలు, ముఖ్య కూడళ్లలో కార్యదర్శులు ప్రజలకు వినిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిఫాల్టర్ రైస్ మిల్లర్లకు ఈ సీజన్‌లో ధాన్యం ఇవ్వకూడదన్నారు. మిగితా మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీతో ధాన్యం కేటాయిస్తామన్నారు. సన్నం, దొడ్డు రకం వడ్లను గుర్తించేందుకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఏవో అనురాధ, డీసీవో నీరజ, డీఎం సంధ్యారాణి, డీసీవో కిష్టయ్య, డీఎంవో సురేఖ, అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్, బూరాల సత్యనారాయణ, గంధం నరేందర్ పాల్గొన్నారు.

**ప్రణాళికలు రూపొందించాలి**

తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పర్యాటక, చారిత్రక స్థలాల సందర్శన కోసం ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు ఉచితంగా పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఈవో జ్ఞానేశ్వర్, బీసీ సంక్షమ అధికారి పుష్పలత, మైనారిటీ అధికారి సౌజన్య, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా ప్రజలకు కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# ఇది బీఆర్ఎస్ ఘనతే..

- విద్యుత్ చార్జీలు పెంచకుండా అడ్డుకున్న పార్టీ
- రాష్ట్ర ప్రజలపై పడని రూ. 18,500 కోట్ల భారం
- తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- పటాకులు కాల్చి స్వీట్ల పంపిణీ

రాయపర్తిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

గిర్మాజీపేట, అక్టోబర్ 30: బీఆర్ఎస్ పేదల తరపున కొట్లాడే పార్టీ అని, విద్యుత్ చార్జీలు పెంచకుండా పోరాడిన ఘనత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కే దక్కుతుందని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. రూ. 18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారం తెలంగాణ ప్రజలపై పడకుండా చేసిన కేటీఆర్ పిలుపుమేరకు బుధవారం శివనగర్‌లోని తన ఇంటి ఆవరణలో బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై రూ. 18,500 కోట్ల భారాన్ని మోపాలని చూసిందని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ కేటీఆర్ పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని విద్యుత్ చార్జీలు పెంచకుండా ఈఆర్సీని ఒప్పించారన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఈ విషయాన్ని గమనించాలని, ఆ పార్టీ కార్యకర్తలకు ఉచిత విద్యుత్ వస్తుందా.. గుండెలపై చేయి వేసుకొని చెప్పాలని కోరారు. కళ్లబొల్లి మాటలు, హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దీపావళి పండుగ పూట తెలంగాణ ప్రజల గుండెల్లో విద్యుత్ ధరల పెంపు బాంబు పేల్చకుండా బీఆర్ఎస్ అడ్డుకుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, 34వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మార్కెట్ మాజీ చైర్మన్ తుమికి రమేశ్‌బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**ముమ్మాటికీ బీఆర్ఎస్ విజయం**

నర్సంపేటరూరల్: విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వాయిదా వేయించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందని పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అన్నారు. మహేశ్వరం శివారులోని నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారిలో బుధవారం బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం డిస్కం ద్వారా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ. 18,500 కోట్ల భారం మోపాలని చూసిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల గృహ వినియోగదారులు, పరిశ్రమలకు జరిగే నష్టాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఈఆర్సీ కమిటీ నిర్వహించిన సమావేశంలో పాల్గొని, ప్రజలపై విద్యుత్ భారం పడకుండా ఉండేలా ఆర్డర్స్ ఇవ్వాలని వివరించారన్నారు. దీంతో ఈఆర్సీ కమిటీ విద్యుత్ చార్జీలు పెంచకుండా తీర్పును వెల్లడించిందన్నారు. ఈ తీర్పు ప్రజల విజయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ ఇన్‌చార్జీలు మోతె పద్మనాభరెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మోటూరి రవి, కొడారి రవన్న, తాళ్లపల్లి రాంప్రసాద్, కట్ల సుదర్శన్‌రెడ్డి, కడారి కుమారస్వామి, భూక్యా వీరన్న, వల్లాల కరుణాకర్‌గౌడ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు అల్లి రవి, మంచిక రాజుగౌడ్, బండారి మల్లయ్య, భూక్యా వీరన్న, పోటు రాయపురెడ్డి, బానోత్ శంకర్, పెండ్యాల ప్రభాకర్, ఆంగోత్ సుధాకర్‌లాల్, చేరాల గోవర్ధన్, నర్సింగం, బండారి రమేశ్, పత్రి కుమారస్వామి, చిన్నపెల్లి నర్సింగం, పాత్కాల కొమ్మాలు, జినుకల విజేందర్, చాపర్తి భిక్షపతి, పొన్నం రమేశ్, సాంబరాజ్యం, వెంకటేశ్వర్లు, దేవేందర్, అశోక్, భీరం మాధవరెడ్డి, పెండ్యాల మునేందర్, నర్సింగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సంపేటరూరల్: మహేశ్వరంలో సంబురాలు నిర్వహిస్తున్న నాయకులు

**కాంగ్రెస్‌కు ముచ్చెమటలు**

రాయపర్తి: కరెంట్ చార్జీలు పెంచేందుకు యత్నించిన కాంగ్రెస్ సర్కార్‌కు ముచ్చెమటలు పట్టించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందని పార్టీ మండలాధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్ అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ 420 అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో పార్టీ శ్రేణులు పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, ఆకుల సురేందర్‌రావు, కుందూరు రాంచంద్రారెడ్డి, పూస మధు, నయీం, కర్ర రవీందర్‌రెడ్డి, కాశీనాథం, జాజునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, యాదగిరిరెడ్డి, రంగయ్య, భాస్కర్, సుధాకర్, రామ్‌యాదవ్, ప్రసాద్, ప్రభాకర్, అక్బర్, కుమార్, చిలువేరు సాయిగౌడ్, సింహాద్రి, అశోక్, ఉపేందర్, ఉప్పలయ్య, జగన్, రవి, మధు పాల్గొన్నారు.

ఎనుమాముల మార్కెట్‌లో తడిసిన పత్తి బస్తాలు

# గాలివాన బీభత్సం

నల్లబెల్లి/చెన్నారావుపేట/కాశీబుగ్గ, అక్టోబర్ 30: జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం గాలివాన బీభత్సం సృష్టించింది. నల్లబెల్లిలో మధ్యాహ్నం ఒక్కసారిగా కుండపోత వర్షం పడింది. చెన్నారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట దెబ్బతిన్నది. పత్తినాయక్ తండాతోపాటు ఇతర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నేలవాలింది. వరంగల్ నగరంలోనూ భారీ వర్షం కురిసింది. దీంతో ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి బస్తాలు తడిసి ముద్దయ్యాయి. మార్కెట్‌కు సుమారు 6 వేల పత్తి బస్తాలు వచ్చాయి. చాలా వరకు తడిసిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

**పిడుగు పాటుకు వ్యవసాయ కూలీ మృతి**

నాగరాజు(ఫైల్)

చెన్నారావుపేట: పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన కల్‌నాయక్‌తండాలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన కొర్ర నాగరాజు(28) బుధవారం తన తల్లి శాంతతో కలిసి పత్తి ఏరేందుకు వెళ్లాడు. అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడడంతో కూలీలంతా చెట్టు కిందకు వెళ్లారు. నాగరాజు కూడా చెట్టు కిందకు వెళ్తుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందిడు. పక్కనే ఉన్న శాంతకు గాయాలయ్యాయి. నాగరాజుకు భార్య విజయ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాగరాజు మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## జర్నలిస్టులు జవాబుదారిగా ఉండాలి

వర్ధన్నపేటలో ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఈగ మల్లేశం

వర్ధన్నపేట, అక్టోబర్ 30: జర్నలిస్టులు సమాజానికి జవాబుదారిగా ఉండాలని కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల బోర్డు పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. సమాజాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు జర్నలిస్టులు ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, కాంగ్రెస్ నాయకుడు రాయపురం సాంబయ్య, కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, రామకృష్ణ, బీజేపీ నాయకులు ఆర్.కుమారస్వామి, పెద్దూరి రాజ్‌కుమార్, కర్ర మాధవీలత, సంపత్‌రావు, ఎండీ.రహీమ్, ఎలీషా, ఆరెల్లి రవి, భాస్కర్, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 16 జిల్లాల్లో 55 సీసీఐ కేంద్రాలు

కాశీబుగ్గ, అక్టోబర్ 30: వరంగల్ రీజినల్ పరిధిలోని 16 జిల్లాలో 55 సీసీఐ కేంద్రాలను ప్రారంభించినట్లు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు రైతులు COTT-ALLY మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. తేమ 8 శాతం మించకుంటే మద్దతు ధర లభిస్తుందన్నారు. 12 శాతం వరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఆరబెట్టిన పత్తిని సీసీఐ కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. వివరాలకు రైతులు సీసీఐ బ్రాంచ్ కార్యాలయం 0870-2565077 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## వాటర్ ట్యాంకు ఎక్కి యువకుడి హల్‌చల్

వర్ధన్నపేట, అక్టోబర్ 30: భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు మద్యం మత్తులో వాటర్ ట్యాంకు ఎక్కి హల్‌చల్ చేసిన ఘటన రామోజీ కుమ్మరిగూడెంతండాలో బుధవారం జరిగింది. తండావాసుల కథనం ప్రకారం.. భూక్యా గణేశ్(30)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆమె పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. కొంతకాలంగా భార్య కాపురానికి రావడం లేదు. మనస్తాపానికి గురైన గణేశ్ వారం రోజుల క్రితం ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో తండావాసులు రక్షించారు. బుధవారం ఉదయం తండాలోని వాటర్ ట్యాంక్ ఎక్కి దూకేందుకు ప్రయత్నించాడు. గమనించి తండాకు చెందిన యువకులు గణేశ్‌ను బుజ్జగించి రెండు గంటల తర్వాత చాకచక్యంగా ట్యాంకు పైనుంచి కిందకు దించారు. మద్యం మత్తులో ఉన్న యువకుడికి నచ్చజెప్పి ఇంటికి పంపించారు.

## ఉపాధ్యాయుల నిలదీత

నర్సంపేట రూరల్, అక్టోబర్ 30: సమయం ముగియక ముందే పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను తండావాసులు నిలదీసిన ఘటన ముత్యాలమ్మతండాలో బుధవారం జరిగింది. తండాలోని ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. 22 మంది విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. బుధవారం పాఠశాలకు వచ్చిన ముగ్గురు ఉపాధ్యాయులు మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి వెళ్లేందుకు బయల్దేరుతుండగా తండాకు చెందిన నూనావత్ శ్రీనివాస్‌తోపాటు మరికొంత మంది యువకులు గమనించి ప్రశ్నించారు. డీఈవోకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో మళ్లీ విధులను కొనసాగించారు.

## హామీలను నెరవేర్చాలి

ఖానాపురం, అక్టోబర్ 30: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఐనపల్లి ఐటీఐ కళాశాల ఆవరణలో బుధవారం తెలంగాణ ఉద్యమకారుల ఐక్యకార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల జేఏసీ అడహక్ కన్వీనర్లుగా కోడి మల్లేశ్, కందికట్ల జయ, జేఏసీ చీఫ్ అడ్వయిజర్‌గా వెంకటనారాయణను ఎన్నుకున్నారు. సమావేశంలో గుంటి రాంచందర్, మల్లేశం, జగన్, కాంతమ్మ, శోభ, కృష్ణారావు పాల్గొన్నారు.

## 'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

నెక్కొండ, అక్టోబర్ 30: ఎస్సీ, ఎస్టీలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేందర్ అన్నారు. అలంకానిపేటలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. అర్హులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో కార్యదర్శి మధు, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం యాదగిరి పాల్గొన్నారు.

## వర్షపు నీటిని ఒడిసి పట్టాలి


అవగాహన ర్యాలీలో లెక్చరర్లు, విద్యార్థులు

గీసుగొండ, అక్టోబర్ 30: వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని భూగర్భజలాల శాస్త్రవేత్త రవి అన్నారు. కోనాయిమాకుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం భూగర్భజలాల పెంపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రైతులు సూక్ష్మసేద్యం చేయాలన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి రక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్‌రావు, ఎస్సై కుమార్, లెక్చరర్లు మహేందర్, సునీల్ పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- సమన్వయ కమిటీ సభ్యులతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

సంగెం, అక్టోబర్ 30: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యులతో బుధవారం ఆయన హనుమకొండలోని తన గృహంలో సమీక్షించారు. గ్రామాల్లో కార్యకర్తలకు ఏదైనా సమస్య ఎదురైతే మండలస్థాయి నాయకులు పరిష్కరించాలని, అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. బెదిరింపులకు బయపడొద్దన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరై నిర్మించుకున్న ఇండ్ల బిల్లుల విషయమై నాయకులు చల్లాను అడగగా, కోర్టులో కేసు నడుస్తోందని, త్వరలోనే సానుకూల తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, సంగెం సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామియాదవ్, దోపతి సమ్మయ్యయాదవ్, బొంపెల్లి దిలీప్‌రావు, ఉండీల రాజు, పూజారి గోవర్ధన్ గౌడ్, మాజీ ఎంపీపీలు దొనికెల మల్లయ్య, కక్కెర్ల సదానందం, జక్క మల్లయ్య, సుతారి బాలకృష్ణ పాల్గొన్నారు.

## 'సర్వేను సమర్థవంతంగా చేపట్టాలి'

సంగెం, అక్టోబర్ 30: సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని ఎంపీడీవో రవీందర్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కార్యదర్శులకు సర్వేపై అవగాహన కల్పించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పార్మాట్‌లో ఉన్న అన్నింటికీ సరైన సమాధానాలు ఇవ్వాలన్నారు.

**వృద్ధులకు పండ్ల పంపిణీ**

కాశీబుగ్గ, అక్టోబర్ 30: కాశీబుగ్గలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమాన్ని బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సాయికుమార్ సందర్శించారు. అనంతరం అనాథలు, వృద్ధులు, మానసిక దివ్యాంగులకు పండ్లు అందించారు.

**14 నుంచి వారోత్సవాలు**

ఖిలావరంగల్, అక్టోబర్ 30: శివనగర్‌లోని డాన్‌బోస్కో నవజీవన్ సంస్థలో వచ్చే నెల 14 నుంచి బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డాన్‌బోస్కో డైరెక్టర్ ఖోషి అన్నారు. వారం రోజులపాటు కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు చెప్పారు. బాలల సంరక్షణ, చైల్డ్ మేళా, బాలలపై లైంగిక దాడి, హింస నివారణ, చికిత్స తదితర అంశాలపై అవగాహన సదస్సులు ఉంటాయని చెప్పారు.

**గీత కార్మికుడికి తీవ్రగాయాలు**

నెక్కొండ, అక్టోబర్ 30: గీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన ఘటన దీక్షకుంటలో జరిగింది. బుధవారం మేరుగు శివ తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా మోకు జారీ పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శివను చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు.

**నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ**

నర్సంపేటరూరల్, అక్టోబర్ 30: నర్సంపేట మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బి.సువత్సల, వైస్ ప్రిన్సిపాల్‌గా ఎం.చంద్రకళ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా నుంచి బి.సువత్సల, జగిత్యాల జిల్లా నుంచి ఎం.చంద్రకళ ఇక్కడకు వచ్చారు. అనంతరం వారు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు.

**మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు**

నర్సంపేట, అక్టోబర్ 30: నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం నుంచి ఆదివారం వరకు నాలుగు రోజులు సెలవు ఇస్తున్నటట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నుంచి కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

**దరఖాస్తుల గడువు పొడిగింపు**

నర్సంపేటరూరల్, అక్టోబర్ 30: పారామెడికల్ కోర్సుల దరఖాస్తుల గడువు పొడగించినట్లు నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డీఈసీజీ, డీడీఐఏఎల్‌వైఎస్ఐఎస్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**'అధికార ప్రతినిధి'గా కోడి అశోక్**

ఖానాపురం, అక్టోబర్ 30: బీసీ సంఘం నర్సంపేట నియోజకవర్గ అధికార ప్రతినిధిగా బుధరావుపేటకు చెందిన కోడి అశోక్ కుమార్‌యాదవ్‌ను నియమించారు. బుధవారం సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డ్యాగల శ్రీనివాస్ చేతులమీదుగా అతడు నియామక పత్రం అందుకున్నాడు.

# రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నల్లబెల్లి/చెన్నారావుపేట/వర్ధన్నపేట/పర్వతగిరి, అక్టోబర్ 30: జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నల్లబెల్లి మండలంలోని నందిగామ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి గుండెబోయిన సన్నీ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అతడు నవంబర్‌లో మెదక్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని హెచ్ఎం అనురాధ తెలిపారు. చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థి బాదావత్ ప్రశాంత్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్ఎం సునీత తెలిపారు. అంతేకాకుండా వర్ధన్నపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు బీ కార్తీక్, భార్గవ్, వర్షిత్, ఉదయ్, సిద్ధూ, తులసీరాం, రుత్విక్, రిషిత్ వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నీకాయిట్, అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పర్వతగిరి టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్‌కు చెందిన ఎం అమూల్య 53 కేజీల విభాగంలో, పూజ 60 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

**నన్నపునేని దీపావళి శుభాకాంక్షలు**

గిర్మాజీపేట, అక్టోబర్ 30: తూర్పు నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ బుధవారం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

**దివాళి విత్ మై భారత్**

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 30: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం యువజన జిల్లా అధికారి చింతల అన్వేష్ నేతృత్వంలో దివాళి విత్ మై భారత్ కార్యక్రమాన్ని సీకేఎం, ఎంజీఎం దవాఖానల్లో నిర్వహించారు. రోగులను విభాగాలకు తరలించడం, వైద్య పరీక్షల విభాగాలను చూపించడం, మందులు అందించడం, మందుల వినియోగాన్ని వివరించారు.

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు**

వర్ధన్నపేట, అక్టోబర్ 30: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన మండల కేంద్రం సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఐనవోలు మండలం నందనం గ్రామానికి చెందిన పెరుమాండ్ల రఘు(25), బెల్లి రాజు(23) బుధవారం రాత్రి వర్ధన్నపేటకు బైక్‌పై వస్తున్నారు. దమ్మన్నపేటకు చెందిన గజవెల్లి ప్రభు వర్ధన్నపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు కాగా, మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. వారిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

**'నాణ్యమైన పత్తిని తీసుకురావాలి'**

కాశీబుగ్గ, అక్టోబర్ 30: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 7521 దక్కాలంటే తేమలేని నాణ్యమైన పత్తిని మాత్రమే తీసుకురావాలని కార్యదర్శి పోలెపాక నిర్మల కోరారు. బుధవారం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పత్తిలో తేమ శాతం 9 నుంచి 11 వరకు ఉన్నట్లు తెలిపారు. పత్తిలో నీళ్లు చల్లొద్దన్నారు.

# ఇదేనా మెరుగైన వైద్యం

- కాంగ్రెస్ పాలనలో రోగుల అవస్థలు
- నర్సంపేట ఆస్పత్రిలో మందుల్లేవు
- గాల్లో దీపంలా పేదల ప్రాణాలు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట, అక్టోబర్ 31: కాంగ్రెస్ పాలనలో పేదలకు మెరుగైన వైద్యం కరువైందని, కనీసం మందు బిల్లలు కూడా అందుబాటులో లేవని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సంపేట ప్రాంత ప్రజలకు ప్రభుత్వం ఇచ్చే దీపావళి కానుక ఇదేనా అని ప్రశ్నించారు. పేద ప్రజలకు వైద్యం అందించడంలో జిల్లా మంత్రుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. నర్సంపేటలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, మాజీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చొరవతో బీఆర్ఎస్ ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మించి చరిత్రను సృష్టించిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు డివిజన్‌లో 58 పల్లె దవాఖానలు మంజూరు చేశామని గుర్తుచేశారు. నర్సంపేటలో మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంక్, టీడయాగ్నొస్టిక్ సెంటర్, ఆర్టీపీసీఆర్ సెంటర్, ఆక్సిజన్ సెంటర్ ఇలా ఎన్నో సౌకర్యాలు వచ్చాయని వివరించారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పెద్దాసుపత్రిలో మందుల కొరతతో పేదల ప్రాణాలు గాల్లో దీపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రులు పర్యవేక్షణను పట్టించుకోవడం లేదన్నారు. దీంతో పాము, తేలు కాటుకు మందులు లేవని, గర్భిణులకు బెడ్స్ అందుబాటులో లేవని, రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు పంపిస్తున్నారని ఆరోపించారు. పిల్లలకు టానిక్ కావాలన్నా వైద్యులు బయటకు రాసిస్తున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్ కిట్‌తో వేలాది మంది గర్భిణులకు పురుడు పోసిన ఆస్పత్రిలో నేడు మందులు లేని దుస్థితి నెలకొందన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సరిపడా మందులు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# 'అధికారుల పని విధానం మారాలి'

కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖిలావరంగల్, అక్టోబర్ 30: వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో అధికారుల పని విధానం మారాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయాలు మార్కెట్ నియమాలకు విరుద్ధంగా ఉన్నాయని, వాటిని సరిచేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం అందజేశారు. మార్కెట్ అధికారులకు తెలియకుండానే చాంబర్ ప్రతినిధులు ధర విషయంలో చేస్తున్న నిర్ణయాలు విరుద్ధంగా ఉన్నాయన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, నాయకులు ఐటం నగేశ్, జెండా అంబయ్య, రవీందర్ పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన ఉద్యమకారులు

## 'కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి'

నెక్కొండ, అక్టోబర్ 30: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో రైల్‌రోకో సందర్భంగా పెట్టిన కేసులను నేటికీ ఎత్తివేయాలేదని, దశాబ్దాల కాలంగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని నెక్కొండ మండల తెలంగాణ ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేశారు. అలంకానిపేటకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు రైల్‌రోకో కేసులో బుధవారం హనుకొండ కోర్టుకు హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు, పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోర్టుకు హాజరైన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటుక సోమయ్య, మాజీ సర్పంచ్ మాదాసు రవి, సూరం రమేశ్, తాత సుధాకర్, దంతాల రవి, మాసం వెంకటేశ్వర్లు, కోరుకొండ యాకయ్య పాల్గొన్నారు.

# నెక్కొండలో గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల ధర్నా

ధర్నా చేస్తున్న బాధిత రైతులు

నెక్కొండ, అక్టోబర్ 30: తమకు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నెక్కొండలో తోపనపల్లికి చెందిన గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఎన్‌హెచ్ 163 గ్రీన్‌ఫీల్డ్ కింద సాగు భూములను కోల్పోతున్న తమకు ప్రభుత్వం బహిరంగ మార్కెట్ రేటు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. సాగు భూములకు ఎకరానికి రూ. 80 లక్షలు పలుకుతుంటే అధికారులు మాత్రం రూ. 10 లక్షల నుంచి 15 లక్షల వరకు ధర చెల్లించేందుకు సిద్ధమవుతున్నారన్నారు. సరైన మార్కెట్ ధర చెల్లిస్తేనే భూములు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ధర్నాలో తోపనపల్లి రైతులు రామరాజు, కృష్ణంరాజు, కుమారస్వామి, పూలమ్మ, శశిరేఖ పాల్గొన్నారు.

**2న హనుమకొండకు బీసీ కమిషన్**

ఖిలావరంగల్, అక్టోబర్ 30: హనుమకొండ కలెక్టరేట్‌కు వచ్చే నెల 2న బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం వస్తున్నట్లు కలెక్టర్ సత్య శారద తెలిపారు. కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారని తెలిపారు. వరంగల్, హనుమకొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాల ప్రజల నుంచి దరఖాస్తులు, విజ్ఞప్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

**అక్రమ అనుమతులపై విచారణ**

సంగెం, అక్టోబర్ 30: గుంటూరుపల్లిలో జీపీ రికార్డులను బుధవారం డీఎల్పీవో వేదవతి తనిఖీ చేశారు. కార్యదర్శి అనిత మొండ్రాయికి బదిలీ అయ్యారు. చౌటపల్లి నుంచి సరిత బదిలీపై వచ్చారు. అయితే, అనిత బదిలీ అయినా సరితకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇవ్వడం లేదు. ఇండ్ల నిర్మాణాలకు అక్రమంగా అనుమతులు ఇచ్చినట్లు గ్రామస్తులతోపాటు ప్రస్తుత కార్యదర్శి సరిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్పీవో రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంపీవో కొమురయ్య ఉన్నారు.